సాక్షి
చిత్తూరు

శనివారం ၊ 21 ၊ డిసెంబర్ ၊ 2024




**రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు..**
పుత్తూరు జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. -IIలో



**బర్త్‌డే ఏర్పాట్లకు ఆటంకం**
వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు నిర్వహణ ఏర్పాట్లకు అధికారులు ఆటంకం కలిగించారు. -IIలో



**351 బస్తాల రేషన్ పట్టివేత**
అక్రమంగా లారీలో తరలిపోతున్న 351 బస్తాల రేషన్ బియ్యాన్ని అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. -IIలో

# జగనన్న యజ్ఞం నేడు భగ్నం



జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదివే పేద విద్యార్థులకు 2021–22, 2022–23 విద్యాసంవత్సరాల్లో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ప్రతి డిసెంబర్ 21న ఉచితంగా ట్యాబ్‌లను అందజేశారు. రెండు సంవత్సరాల్లో 62,425 మంది విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లను పంపిణీ చేశారు. గత ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌ల వల్ల సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థుల్లో సామర్థ్యాలు మెరుగు పడ్డాయని ఉపాధ్యాయులు వెల్లడిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కక్ష సాధింపుతో గతంలో ఇచ్చిన ట్యాబ్‌లను సైతం వినియోగించకుండా చేస్తోంది. ఉన్న బడులను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తుండడంతో విద్యారంగం ఆరు నెలల్లో ఆరేళ్ల వెనక్కి వెళ్లిపోయిందని విద్యావేత్తలు చెబుతున్నారు.



చిత్తూరు: కణ్ణన్ పాఠశాలలో ట్యాబ్‌ల ద్వారా విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు (ఫైల్)



- పేదల చదువులపై కత్తి దూసిన సర్కార్
- పథకాలకు పంగనామాలు.. చిక్కిన చదువులు
- ఈ ఏడాదిలో ట్యాబ్‌లు అందక నష్టపోయిన విద్యార్థులు
- విద్యాభివృద్ధికి వన్నె తెచ్చిన జగనన్న

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా 2019కు ముందు సర్కారు బడుల పట్ల తల్లిదండ్రులకు చిన్న చూపు ఉండేది. 90 శాతానికి పైగా తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల వైపే మొగ్గు చూపించేవారు. అలాంటి పరిస్థితులను అధిగమించి 2019 నుంచి 2024 సార్వత్రిక ఎన్నికల వరకు గత వైఎస్సార్‌సీపీ సర్కారు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసింది. గత ఐదేళ్లలో శిథిలావస్థకు చేసిన సర్కారు బడులకు ఊపిరి పోసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యాభివృద్ధి కోసం సంక్షేమ పథకాలను దిగ్విజయంగా అమలు చేసిది. ప్రతి ఏటా డిసెంబర్ 21వ తేదీన అప్పటి సీఎం వైఎస్.జగన్ పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులను ఉచితంగా అందజేసింది. ఈ ఏడాదిలో కూటమి ప్రభుత్వం కొత్త ట్యాబ్‌లను ఇవ్వకపోగా గత ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లను విద్యార్థులు వినియోగించకుండా కక్ష సాధిస్తోందని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

| జిల్లా వివరాలు (గత ఐదేళ్లలో జిల్లాలో విద్యాభివృద్ధి పథకాలు, లబ్ధి) | | |
|---|---|---|
| పథకం పేరు | లబ్ధిపొందిన వారి సంఖ్య | ఖర్చు చేసిన మొత్తం రూ.కోట్లల్లో |
| ఉచిత ట్యాబ్‌లు | 1,58,085 | రూ.316.17 |
| విద్యాదీవెన, వసతిదీవెన | 3,45,879 | రూ.940.62 |
| గోరుముద్ద | 6,99,404 | రూ.679.25 |
| విద్యాకానుక | 6,99,404 | రూ.134.18 |
| అమ్మఒడి | 6,99,404 | రూ.2497.1 |
| నాడు నేడు | 1953 పాఠశాలలు | రూ.600.04 |
| మొత్తం | | రూ.5167.36 |

| ఈ విద్యాసంవత్సరం ట్యాబ్‌లు పొందలేక నష్టపోయిన విద్యార్థులు | |
|---|---|
| బాలురు | 24,930 |
| బాలికలు | 23,311 |
| మొత్తం విద్యార్థులు | 48,241 |

### తొలి పథకం చిత్తూరు నుంచే..

2019లో సీఎంగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం అమ్మఒడి పథకానికి శ్రీకారం చుట్టారు. ఆ పథకాన్ని మొట్ట మొదటి సారిగా చిత్తూరు జిల్లా నుంచే ప్రారంభించారు. 2020 జనవరి 9వ తేదీన చిత్తూరు జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల మైదానంలో అమ్మ ఒడి పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఆ మొట్టమొదటి అమ్మఒడి పథకంలో 3,32,950 మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చారు. 2019 నుంచి 2024 వరకు చిత్తూరు జిల్లాలో విద్యాభివృద్ధి కోసం వేలాది కోట్లను ఖర్చు చేసి పేదల కుటుంబాల్లో వెలుగులు నింపారు.

### తల్లికి వందనం ఎక్కడ?

గత ప్రభుత్వం ఇచ్చిన విధంగానే అమ్మఒడి పథకాన్ని కాపీ కొట్టిన కూటమి సర్కారు గత ఎన్నికల్లో సూపర్‌సిక్స్ పథకాల అమలు చేస్తామంటూ ఊదరగొట్టింది. అధికారంలోకి వచ్చిన వెంటనే తల్లికి వందనం ఇస్తామని హామీలు గుప్పించింది. ఇప్పటికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తి అవుతోంది. అయితే ఇప్పటి వరకు తల్లికి వందనం పథకం గురించే పట్టించుకోలేదు. దీంతో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 2467 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1,58,085 మంది విద్యార్థులు నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం ఇస్తామన్న తల్లికి వందనం పథకాన్ని త్వరగా ఇవ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

### చిల్లిగవ్వ ఇవ్వని దుస్థితి

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్యాలకు సంబంధించి 2,467 పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో చిన్నపాటి మరమ్మతులు చేసుకోవాలన్నా హెచ్‌ఎంల వద్ద చిల్లిగవ్వ కూడా లేని దుస్థితి. గత ప్రభుత్వం సర్కారు బడులకు అధిక ప్రాధాన్యతనిచ్చి నాడు నేడు పథకంలో ఎంపికైన బడులకు కోట్ల రూపాయలను ఖర్చు చేసింది. జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొదటి దశ నాడు నేడు పనుల్లో 743 పాఠశాలలకు రూ.150.24 కోట్లు, రెండవ దశలో 1,210 పాఠశాలలకు రూ.449.80 కోట్లను గత ప్రభుత్వం ఖర్చు చేసింది. జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో తాగు నీరు లేక విద్యార్థులు ఇళ్ల నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. నాడు నేడు పథకంతో సర్కారు బడులను ప్రైవేట్ బడులకు దీటుగా రూపురేఖలు మార్చింది. జిల్లాలో నాడు నేడు పనులు చేపట్టని పాఠశాల్లో మౌళిక వసతులకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నా సర్కారు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ బడుల్లో పనిచేస్తున్న 7,867 మంది ఆయాలకు 8 నెలలుగా జీతాలు మంజూరు చేయడం లేదు. దీంతో ఆ చిరుద్యోగులు అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నారు.

### అట్టడుగు స్థాయికి విద్యావ్యవస్థ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విద్యావ్యవస్థ అట్టడుగు స్థాయిలోకి పడిపోయింది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై తల్లిదండ్రులు ఈ సర్కారుపై నమ్మకం కోల్పోయారు. తల్లికి వందనం పథకం ప్రస్తావనే లేదు. ఇక ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులన్నీ పెండింగే. క్షేత్రస్థాయిలో విద్యావ్యవస్థ పనితీరు ఎలా ఉందనే అంశంపై కూటమి సర్కారు సర్వే చేయించింది. ఈ సర్వేలో చిత్తూరు జిల్లాకు సంబంధించి సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థుల ఫలితాలు నాలుగో స్థానానికి పడిపోవడం విస్మయం కలిగిస్తోంది. గత ఐదేళ్ల పాటు సర్కారు బడులకు ఎన్నడూ లేని వైభవం తీసుకురాగా, ప్రస్తుతం కూటమి సర్కారు ఆరు నెలల్లోనే అట్టడుగు స్థాయిలో పడిపోయేలా చేసింది.



చిత్తూరులో అమ్మఒడి పథకం నిధులు విడుదల చేస్తున్న వైఎస్ జగన్ (ఫైల్)



పాలసముద్రం: ఆముదాల హైస్కూల్లో వాటర్ బాటిళ్లు తెచ్చుకున్న విద్యార్థులు

### గతంలో సమయానికి ఫీజు రీయింబర్స్‌మెంట్

గత ప్రభుత్వ హయాంలో ఉన్నత విద్య చదివే విద్యార్థులెవ్వరికీ ఇబ్బందులు లేకుండా ప్రతి ఏటా సమయానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తల్లుల ఖాతాల్లో జమచేసేవారు. ప్రతి 3 నెలలకోసారి, త్రైమాసికం అయిన వెంటనే విద్యార్థుల తల్లులకు డబ్బులిచ్చి వారి చదువులకు తోడుగా నిలిచారు. ఆరు నెలలుగా విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన అందక ఇబ్బంది పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 91,320 మంది విద్యార్థులకు రూ.150.28 కోట్ల వరకు నిధులు విడుదల చేయాల్సి ఉంది. ఫీజులు చెల్లించలేక చదువులు మానేసి పనులకు వెళ్తున్నారు. విద్యార్థులు ఫీజులు చెల్లించకపోవడంతో జిల్లా వ్యాప్తంగా పలు యాజమాన్యాలు కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందకుండా ఇబ్బందులు పడుతున్నారు.



విద్యాసంక్షేమ పథకాల ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న అప్పటి సీఎం వైఎస్ జగన్ (ఫైల్)

### టీడీపీ కూటమి పాలనలో ఫీజుల కోసం అప్పులు

జిల్లా వ్యాప్తంగా 91,320 మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదువుతున్నారు. వీరందరికీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను చెల్లించడం లేదు. సంబంధిత కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి చేస్తూ బయటకు పంపేస్తున్న ఘటనలు పలు చోట్ల జరుగుతున్నాయి. ఇవన్నీ తెలిసినప్పటికీ కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా ఉన్నత విద్య చదివే విద్యార్థులను మోసగిస్తోంది. ఫలితంగా తల్లిదండ్రులు గత్యంతరం లేక అప్పులు చేసి విద్యార్థుల ఫీజులు చెల్లించాల్సిన దుస్థితి ఎదురవుతోంది.

#### చదువు భారంగా మారింది



గతంలో ప్రతి ఏటా అమ్మఒడి పథకం కింద డబ్బులిచ్చేవారు. ఇప్పుడేమో ఇంత వరకు ఎలాంటి పథకం అమలు చేయలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తల్లికి వందనం అమలు చేస్తామన్నారు. ఇంత వరకు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. నా బిడ్డ ఫీజు చెల్లించేందుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ఐదేళ్లలో పాపను ఎలాంటి కష్టం లేకుండా చదివించుకునేదాన్ని. ఇప్పుడు నా పాప చదువు భారంగా మారింది.
– కుమార్తె శరణ్యతో తల్లి కవిత

#### ప్రభుత్వ బడుల వెనకడుగు



గత ఐదేళ్ల పాటు ప్రభుత్వ బడుల రూపురేఖలు మారాయి. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో సైతం లేని సౌకర్యాలను ప్రభుత్వ బడుల్లో కల్పించారు. ఇప్పుడేమో కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులపై కన్నెర్ర చేసింది. ప్రభుత్వ బడుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిల్లిగవ్వ కూడా ఇవ్వడం లేదు. ప్రభుత్వ బడులు వెనక్కి వెళ్లి మళ్లీ పూర్వ స్థితికి చేరిపోయాయి. ఇది ఇలాగే కొనసాగితే మా పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకి పంపించాల్సిన పరిస్థితి వస్తుందేమో!
– చిట్టి, కొత్తపల్లి, విద్యార్థి తండ్రి, పలమనేరు

#### ట్యాబ్‌లు ఇస్తే బాగుంటుంది



గతంలో మా పాఠశాలలో 8వ తరగతి చదివే అక్క, అన్న వాళ్లకు ఉచితంగా ట్యాబ్‌లు ఇచ్చారు. ఆ ట్యాబ్‌లు చూసి మాకు ఎంతో సంతోషం వేసింది. ఆ ట్యాబ్‌ల్లో పాఠాలు చదువుకునేందుకు అనువుగా ఉన్నాయి. ట్యాబ్‌ల్లో నేర్చుకోవడం అంటే మాకిష్టం. నేను 8వ తరగతికి వెళ్లాక ట్యాబు పొందవచ్చని ఆశపడ్డాను. కానీ ఇప్పుడు నేను 8వ తరగతికి వచ్చాక ఎవరికీ ట్యాబ్‌లు ఇవ్వడం లేదని చెబుతున్నారు. దీంతో నా ఆశ ఇప్పట్లో నెరవేరేలా లేదు.
– నేహశ్రీ, గుండ్లకట్టమంచి, బంగారుపాళ్యం

#### అప్పులు చేయాల్సిన దుస్థితి



ఈ ప్రభుత్వంలో నా పిల్లల ఉన్నత చదువుకు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. మా పాప తిరుపతిలో డిగ్రీ చదువుతోంది. ఇంత వరకు ఒక్క రూపాయి కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు చేయలేదు. ఎప్పుడిస్తారో కూడా తెలియదు. ఒకవైపు కాలేజీ వాళ్లు ఫీజు చెల్లించాల్సిందేనని ఒత్తిడి తీసుకొస్తున్నారు. చేసేదేమిలేక అప్పు చేసి ఫీజులు చెల్లించాం. గత ప్రభుత్వంలో ఇద్దరు పిల్లలను ప్రశాంతంగా చదివించుకున్నాం.
– మోహన్‌కుమారి, విద్యార్థి తల్లి, కార్వేటినగరం

#### కుటుంబ పోషణ భారం



ఐదు నెలలుగా జీతాలు చెల్లించడం లేదు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. అత్యవసరాలను కూడా కొనలేని పరిస్థితి ఎదురైంది. పాఠశాలను, బాత్రూమ్‌లు శుభ్రం చేయడానికి అవసరయ్యే చీపురు కట్టలు, సోపులు, ఫినాయిల్, గ్లౌజు, కాళ్లకు చెప్పులు అందించడం లేదు. గుర్తింపు కార్డులు, యూనిఫారం అందించాలి. 108 జీవో ప్రకారం జీతం మా ఖాతాకు జమ చేయాలి. దీనిపై మేము పోరాటం చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదు.
– లక్ష్మి, ఆయాల అసోసియేషన్ నాయకురాలు, నగరి

## న్యూస్‌రీల్

### అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : పార్లమెంటు సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌ను అవమానపరిచే విధంగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి డిమాండ్ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశ భవిష్యత్ సమగ్ర అభివృద్ధి కోసం కొంత మంది మేధావులు ఆలోచిస్తారని అందులో ప్రథముడు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అని అన్నారు. అలాంటి మహనీయుడిని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కించపరచడం తగదని హితవు పలికారు. ఇంతలా అమిత్‌షా వ్యాఖ్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇంత వరకు ఖండించకపోవడం బాధాకరమని అన్నారు. జగనన్న రెక్కల కష్టంతో ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, మంత్రులు పదవులు పొందిన వారు నేడు పార్టీని వీడి స్వార్థ ప్రయోజనాల కోసం జగనన్నను విమర్శించడం దారుణమన్నారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం కూలిపోవడం ఖాయం అన్నారు.

### ఎస్సీ, ఎస్టీ ఇళ్ల సర్వే



మాట్లాడుతున్న ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని సబ్సిడీ విద్యుత్ అందుకుంటున్న ఎస్సీ ఎస్టీ సర్వీసులను సర్వే చేయాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. ఎస్‌ఈ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో దాదాపు 86 వేల మంది బడుగులు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందుతున్నారని చెప్పారు. వారికి పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ఉచిత విద్యుత్ అందించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అందుకుగాను ప్రతి సర్వీసును తనిఖీ చేసి రేకులు, పెంకులు, స్లాబు ఇళ్ల అనే అంశాలను పరిశీలించాలని చెప్పారు. అనంతరం అక్కడ సోలార్ పలకలు ఏర్పాటు చేయడానికి సౌకర్యం ఉందా అని చూడాలన్నారు. లబ్ధిదారులు ఎంత లోడ్ కలిగి ఉన్నాడు, ప్రతి నెలా ఎన్ని యూనిట్లు వాడుతున్నారో తెలుసుకోవాలన్నారు. సర్వీసుదారుడి ఆధార్, ఫోన్ నెంబర్, కరెంటు బిల్లులను సేకరించాలని తెలిపారు. వారి వద్ద సోలార్ పలకల కోసం రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు. పీఎం కుసుం పథకం కింద సబ్‌స్టేషన్‌లోని ఫీడర్ల పరిధిలో సర్వే నిర్వహించాలని చెప్పారు. ఇందులో ప్రభుత్వ ఖాళీ స్థలం ఎంత ఉందో నివేదించాలన్నారు. అక్కడ 1 మెగావాట్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసే సోలార్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దీంతో సంబంధిత వ్యవసాయ ఫీడర్లకు ఉచిత విద్యుత్ అందించవచ్చన్నారు. కార్యక్రమంలో ఈఈలు మునిచంద్ర, సురేష్, జగదీష్, ఏఓ ప్రసన్నఆంజనేయులు, పీఓ రెడ్డప్ప, డీఈలు ప్రసాద్, ఆనంద్, శేషాద్రి, కొండయ్య, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

### వరసిద్ధునికి విరాళం



విరాళం అందజేస్తున్న చంద్రారెడ్డి

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం నిత్య అన్నదానానికి దాతలు శుక్రవారం నగదు విరాళం అందించారు. హైదరాబాద్‌కు చెందిన చంద్రారెడ్డి రూ.లక్ష, విజయవాడకు చెందిన చల్లా శివ మీనాక్షి రూ.లక్ష నగదు అందించారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించి స్వామి ప్రసాదం అందజేశారు.

## మత సామరస్యానికి ప్రతీక గంధపు మహోత్సవం



గంధపు మహోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి రోజా

పుత్తూరు: ముస్లింలు ఎంతో పవిత్రంగా నిర్వహించే గంధపు మహోత్సవం మత సామరస్యానికి ప్రతీక అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్కే రోజా పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక గేట్‌పుత్తూరులోని నాగూర్ ఖాదర్‌వల్లీ దర్గాలో జరిగిన గంధపు మహోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ముస్లింలతోపాటు హిందువులూ పాల్గొనడం మన రాష్ట్ర ప్రత్యేకత అన్నారు. కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ మాజీ డైరెక్టర్ మాహీన్, మత పెద్దలు ఇలియాస్, గులాబ్‌ఖాన్, యూసబ్‌ఖాన్, మున్సిపల్ వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్ర, దిలీప్‌మొదలి, షకీలా, తిరునావక్కర్స్, ఏకాంబరం, చిన్నా పాల్గొన్నారు.

## మహిళలు స్వావలంబన దిశగా ఎదగాలి



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ హిమవంశీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా ఎదగాలని ట్రైనీ కలెక్టర్ హిమవంశీ అన్నారు. కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా సమాఖ్య 21వ వార్షిక మహాసభ నివేదిక కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా హాజరైన హిమవంశీ మాట్లాడుతూ మహిళలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా సాధికారతలో డీఆర్‌డీఏ ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి నిమిత్తం వివిధ బ్యాంకులు రుణాలు అందిస్తాయన్నారు. ఆ రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఎటువంటి సమస్యలున్నా జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు తీసుకున్న ఋణాలను తిరిగి చెల్లిస్తే అధిక మొత్తంలో రుణాలు పొందవచ్చన్నారు. రుణాల చెల్లింపులో ఏవైనా సమస్యలుంటే సమాఖ్య పరిధిలో పరిష్కరించుకోవాలని చెప్పారు. అక్కడ పరిష్కారం కాకపోతే జిల్లా సమాఖ్య దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీడీ రవికుమార్, ఏపీఎంలు మధు, సుబ్బారెడ్డి, అరుణ, జ్యోతి, హేమ పాల్గొన్నారు.

## ఇంటర్ వర్సిటీ ఫుట్‌బాల్ పోటీలకు కుప్పం విద్యార్థులు



ఆల్ ఇండియా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

కుప్పంరూరల్: ఆల్ ఇండియా ఇంటర్ వర్సిటీ ఫుట్‌బాల్ పోటీలకు అనంతపురం జేఎన్‌టీయూ తరపున కుప్పం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. కళాశాలలో అబీన్‌బేబీ, శ్రీహరి, దీరిన్ డేవిస్ ఎంపికైనట్లు చైర్మన్ బీసీ నాగరాజు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను శుక్రవారం కళాశాల యాజమాన్యం అభినందించింది. నాగరాజు మాట్లాడుతూ క్రీడల ద్వారా ఏకాగ్రత, శారీరక దారుఢ్యం, పోటీతత్వం అలవడుతుందన్నారు. ఆల్ ఇండియా పోటీల్లో కళాశాల విద్యార్థులు రాణించి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ఆల్ ఇండియా పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ సునీల్‌రాజ్, ప్రిన్సిపల్ సుధాకర్‌బాబు, పీ ఆర్వో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### 22న కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

**పుంగనూరు:** ఉమ్మడి చిత్తూరు జిల్లా కబడ్డీ బాలబాలికల జూనియర్స్ జట్ల ఎంపికను ఈ నెల 22న ఉదయం 10 గంటలకు స్థానిక బీఎంఎస్ క్లబ్‌లో నిర్వహిస్తున్నారు. ఆ సంఘం కార్యదర్శి గంగాధర్ శుక్రవారం తెలిపిన వివరాల మేరకు బాలురు 70 కిలోల బరువు, బాలికలు 65 కిలోల బరువు కలిగి 12-01-2005 తరువాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. ఎంపికైన జట్లను జనవరి 3 నుంచి కర్నూలులో జరిగే 50వ బాలబాలికల అంతర్ జిల్లా పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ ఆధార్ కార్డులతో జట్ల ఎంపికలో పాల్గొనాలని కోరారు.

### సౌత్‌జోన్ ఇంటర్‌వర్సిటీ పోటీలకు ఎంపిక



ఎంపికైన జట్టుతో కళాశాల అధికారులు, కోచ్, మేనేజర్

**తిరుపతి సిటీ:** కేరళలోని కాలికట్ యూనివర్సిటీ వేదికగా శనివారం నుంచి జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (అంగ్రూ) ఫుట్ బాల్ జట్టును ఎంపిక చేశారు. వ్యాయమ విభాగాధిపతి డాక్టర్ రవికాంత్‌రెడ్డి పర్యవేక్షణలో క్రీడాకారులకు శుక్రవారం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ చేతుల మీదుగా స్పోర్ట్స్ కిట్‌ను అందజేశారు. మేనేజర్ పురుషోత్తంరావు, కోచ్ ఎం విజయ్ పాల్గొన్నారు.



తమిళనాడుకు తరలిస్తూ పట్టుబడ్డ సారా ప్యాకెట్లు

చిత్తూరు నగరంలోని చీలాపల్లె బస్టాప్ వద్ద పది రోజుల క్రితం ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు పట్టుకున్న సారా ప్యాకెట్లు ఇవి. ఓ ద్విచక్రవాహనంపై ఏకంగా 110 లీటర్ల నాటుసారా ప్యాకెట్లను తరలిస్తూ పోలీసులకు చిక్కాడో నిందితుడు. ఇతడ్ని విచారిస్తే.. చిత్తూరు మూడో గేటు నుంచి తమిళనాడులోని వేలూరుకు దీన్ని తీసుకెళుతున్నట్లు చెప్పడంతో అధికారులు షాక్ అయ్యారు.



గుడిపాల మండలంలోని రాసనపల్లె అడవుల్లో దాడులు నిర్వహించిన ఎక్సైజ్ పోలీసులకు అడుగడుగునా చిన్నపాటి గుంతలు కనిపించాయి. గుప్త నిధులు ఏమైనా ఉన్నాయా..? అని ఒక్కో గొయ్యిను తవ్వి చూస్తే.. ప్రతీ గుంతలోనూ ఓ సారా బట్టీ. నిల్వ చేసిన వేలాది లీటర్ల బెల్లం ఊటను సారా తయారు చేయడానికి సిద్ధంగా ఉంచారు. ఈ ఒక్కరోజులో పోలీసులు ధ్వంసం చేసిన ఊట నుంచి పది వేల లీటర్ల సారాను తయారు చేయొచ్చు.



రాసనపల్లెలో సారా బట్టీలు ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు (ఫైల్)

# సరిహద్దులు దాటిన సారా

- రాష్ట్రాలు దాటుతున్న చిత్తూరు నాటు సారా
- తమిళ తంబీలు.. కన్నడిగులకు ఇదే మక్కువ
- పేటెంట్‌కు దరఖాస్తు చేసుకున్నా ఇచ్చేస్తారేమో..?
- ప్రభుత్వం మద్యంకు దీటుగా సారా విక్రయాలు
- కట్టడి చేస్తున్నా.. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న బట్టీలు

**చిత్తూరు అర్బన్:** ఇప్పటి వరకు ప్రపంచంలో కెల్లా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మాత్రమే కనిపించే ఎర్ర చందనం వృక్షాలు ఎంత గుర్తింపు పొందాయో కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. చిత్తూరుకు పరిమితమైన 'ఎర్ర' బంగారం కోసం జరుగుతున్న అంతర్యుద్ధం, స్మగ్లింగ్‌లోని కిటుకులు నిత్యం వార్తల్లో రావడం, వెండితెరపై కూడా చూసే ఉంటారు. అయితే ఎర్రచందనం తరువాత ఆ స్థాయిలో మరో వస్తువుకు చిత్తూరు పాపులర్ కానుందా..? ఇప్పటికే తమిళనాడు, కర్ణాటక వాసులు చిత్తూరుకు వచ్చి ఆ పదార్థాన్ని రహస్యంగా తీసుకెళుతున్నారా..? ఆ పదార్థంలోని రుచి ఇంకెక్కడా దొరకడంలేదా..? అన్నీ అనుకున్నట్టు జరిగితే ఆ పదార్థాన్ని మరెక్కడా తయారుకానివ్వకుండా పేటెంట్‌కు ఏమైనా దరఖాస్తు చేసుకుంటారా..? ఈ ప్రశ్నలకు అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఆ పదార్థమే మత్తెక్కించే నాటుసారా.

**సరిహద్దే శాపమా..?**

చిత్తూరు జిల్లాలో తయారయ్యే నాటుసారాకు త్వరలోనే మందు బాబులు పేటెంట్ తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక్కడ తయారయ్యే గుడుంబా రుచి, మత్తు మరెక్కడాలేదని గుర్తించిన వ్యాపారులు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చిత్తూరు సారాను రవాణా చేసుకుంటున్నారు. చిత్తూరు జిల్లాలో తయారయ్యే నాటుసారా ప్రస్తుతం రాష్ట్రాల సరిహద్దులు దాటి, తమిళ తంబీలు, కన్నడిగుల మందు బాబులకు మత్తెక్కిస్తోంది. సారా అంటేనే చిత్తూరుకే సాధ్యమని భౌగోళిక గుర్తింపు తీసుకొచ్చేలా ఇక్కడున్న వ్యాపారులు సారా తయారీపై పూర్తి స్థాయిలో దృష్టి పెడుతున్నారు. జిల్లాలోని చిత్తూరు, గుడిపాల, పాలసముద్రం, నగరి, పలమనేరు, కుప్పం ప్రాంతాలు అటు తమిళనాడు, ఇటు కర్ణాటక రాష్ట్రాలకు చాలా దగ్గరగా ఉన్నాయి. దీంతో ఇక్కడ తయారుచేసే నాటుసారా చాలా సులభంగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. అందులోనూ కొందరు వ్యాపారులు ఎవ్వరికీ అనుమానం రాకుండా ఓ స్కూటర్‌పై వంద లీటర్ల సారా ప్యాకెట్లను చాలా సునాయాసంగా తీసుకెళ్లిపోతున్నారు. ఎక్సైజ్ అధికారులు సరిహద్దు చెక్‌పోస్టులను బలోపేతం చేయడం, ఇక్కడ నిఘా ఉంచడం ద్వారా సారాను కట్టడి చేయొచ్చు.

**రోజుకు లక్ష లీటర్ల ఉత్పత్తి**

జిల్లాలో చిత్తూరు నగరంతోపాటు గుడిపాల పాలసముద్రం గంగాధర్ నెల్లూరు కార్వేటినగరం పుంగనూరు పలమనేరు వి.కోట కుప్పం ప్రాంతాల్లో తయారీ విచ్చలవిడిగా సాగుతోంది. రోజుకు దాదాపు లక్ష లీటర్ల వరకు నాటు సారా ఉత్పత్తి ఆ ప్రాంతాల్లో జరుగుతోంది. ఇది జిల్లాలోని ప్రస్తుతం మద్యం దుకాణాల్లో జరుగుతున్న రెండు రోజుల అమ్మకాలతో సమానం. ఈ స్థాయిలో తయారవుతున్న నాటు సారా కేవలం ఇక్కడి వాళ్లు తాగితే అయిపోదు. జిల్లాతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. నాటు సారాను నియంత్రించడానికి ఎక్సైజ్ అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా పుట్టలోంచి చీమలు వస్తున్నట్లు కుప్పలు కుప్పలుగా నాటు సారా తయారీ కేంద్రాలు వెలుస్తున్నాయి.

### ఎక్కడికక్కడ కట్టడి



"నాటుసారా నియంత్రణ కోసం ప్రతి రోజూ ఓ ప్రణాళికతో పనిచేస్తున్నాం. జిల్లాలో ఎక్కడెక్కడ సారా తయారు చేస్తున్నారు..? ఎన్నేళ్లుగా ఈ వృత్తిలో ఉన్నారు..? అనే వివరాలన్నీ సేకరిస్తున్నాం. సారాతో పట్టుబడేవాళ్లపై నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టి అరెస్టులు కూడా చేస్తున్నాం. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో ప్రత్యేక దృష్టి పెట్టాము. మా వద్ద అన్ని బృందాలు రోజూ సారా కట్టడిపై దాడులు చేస్తునే ఉన్నాయి. సారా తయారీ మాన్పించడానికి ఉపాధి అవకాశాలు ఏవైనా కల్పించాలా..? అనే అంశాన్ని కూడా ఉన్నతాధికారులతో మాట్లాడి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళతాం.

– శ్రీనివాస్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్, చిత్తూరు

### ఉపాధి చూపితే తగ్గుముఖం!

నాటు సారా తయారీకి పెద్దగా పెట్టుబడి అవసరం లేకపోవడంతో దీన్ని కుల వృత్తులుగా నమ్ముకున్న కొన్ని వర్గాలు ఈ ఉపాధిని వదులుకోలేక పోతున్నాయి. ఇదే సమయంలో పోలీసుల సతాయింపు వస్తే తాము చూసుకుంటామని పలుచోట్ల టీడీపీ నేతలు అభయమిస్తున్నారు. వచ్చే లాభాల్లో వాటాలు తీసుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారు. నాటు సారా తయారీ దారి మళ్లించాలంటే .. ఆయా వర్గాలకు శాశ్వత ఉపాధి మార్గాలు చూపించాల్సిన అవసరం ఉంది. సారా తయారీ చేసేవాళ్లకు వ్యవసాయంపై పూర్తిగా పట్టు ఉంటుంది. అలాంటి వాళ్లకు భూములు ఇచ్చి సేద్యం చేసుకునే అవకాశం కల్పించడం, బ్యాంకు రుణాలు, పాడి, చిన్న తరహా పరిశ్రమలు పెట్టుకునేలా అధికారులు చొరవ చూపించాలి. అంటే ప్రభుత్వం కూడా ఇందుకు కావాల్సిన ఆర్థిక వనరులను సమకూర్చాలి. అప్పుడే సారా రక్కసిని మూలాల నుంచి తుంచేయచ్చు.



### బైక్ బోల్తా: యువకుడి దుర్మరణం



మృతి చెందిన దినకర్

**బంగారుపాళెం:** స్థానిక రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనం బోల్తాపడిన సంఘటనలో యువకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని నలగాంపల్లె దళితవాడకు చెందిన శేఖర్ కుమారుడు దినకర్(29), రమేష్ కుమారుడు విక్రమ్ ద్విచక్రవాహనంపై బంగారుపాళెంకు వచ్చి తిరిగి వెళ్తుండగా రిలయన్స్‌పెట్రోల్ బంక్ వద్ద కుక్క అడ్డురావడంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో దినకర్ తీవ్రంగా, విక్రమ్ స్వల్పంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ దినకర్ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### టిఫిన్ సెంటర్‌లోకి దూసుకెళ్లిన కారు



టిఫిన్ సెంటర్‌లోకి దూసుకెళ్లిన కారు

**రొంపిచెర్ల:** రోడ్డు పక్కన ఉన్న టిఫిన్ సెంటర్‌లోకి కారు దూసుకెళ్లిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. తిరుపతి జిల్లా ఎర్రావారిపాళెంకు చెందిన కారు రొంపిచెర్లకు బయల్దేరింది. అయితే రొంపిచెర్ల తెలుగు ప్రాథమిక పాఠశాల మలుపు వద్ద అతి వేగంగా వచ్చి టిఫిన్ సెంటర్‌లోకి దూసుకెళ్లింది. రోడ్డు పక్కన వెళుతున్న కిరణ్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కిరణ్ స్వల్పంగా గాయపడ్డారు. గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో టిఫిన్ సెంటర్‌లో ఎవరూ లేక పోవడంతో ప్రాణనష్టం తప్పింది. చుట్టుపక్కల వారు వచ్చి కారును బయటకు తీశారు.

## జగనన్న పుట్టినరోజు ఏర్పాట్లకు ఆటంకం

- మాజీ సీఎం బర్త్ డే వేడుకల ఏర్పాట్లను చూసి ఓర్వలేకపోతున్న కూటమి నేతలు
- అధికారులతో కలిసి కుయుక్తులు



జేసీబీని అడ్డుకుంటున్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు

**బైరెడ్డిపల్లె :** మండలం లక్కనపల్లెలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు చేస్తుండగా ఓర్వలేని కూటమి నేతలు అధికారులపై ఒత్తిడి తెచ్చి అడ్డుకునేందుకు కుయుక్తులు పన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం సందర్భంగా లక్కనపల్లె సంతగేటులో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆ జెండా వద్ద వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించేందుకు ఈ నెల 19న మట్టి తోలించి చదునుచేశారు. దీంతో ఓర్వలేని కూటమి నేతలు అధికారులపై ఒత్తిడి తెచ్చి.. అనుమతుల్లేకుండా మట్టి తోలడం చట్ట విరుద్ధమంటూ జేసీబీ సాయంతో శుక్రవారం మట్టిని తొలగించారు. దీంతో ఆగ్రహించిన వైఎస్సార్‌సీపీ నేతలు ఘటన స్థలానికి చేరుకున్నారు. కూటమి నేతలు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలకు మధ్య వాగ్వాదం జరిగింది. ఎన్నో ఏళ్లుగా వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్నామని, ఏటా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించుకుంటున్నామని చెప్పారు. ఇప్పుడు అధికారులు రాజకీయ నాయకులకు వంతపాడుతూ అడ్డుకోవడం తగదన్నారు. జగన్ జన్మదిన వేడుకలను జెండా ఉన్న చోటే నిర్వహించి తీరుతామని వైఎస్సార్‌సీపీ నేతలు స్పష్టం చేయడంతో అధికారులు, పోలీసులు వెనుదిరిగారు.

### వివాహిత ఆత్మహత్యాయత్నం

**పుంగనూరు:** వివాహిత ఆత్మహత్యకు యత్నించిన సంఘటన శుక్రవారం మండలంలో వెలుగుచూసింది. స్థానికుల కథనం మేరకు, మండలంలోని కృష్ణాపురానికి చెందిన చిన్నా భార్య నందిని(22) గురువారం రాత్రి కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబీకులు గమనించి వెంటనే ఆమెను మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతోంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### అక్రమ రవాణా కేసులో ముగ్గురు అరెస్ట్

**పుత్తూరు:** రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో శుక్రవారం ముగ్గురు నిందితులను పుత్తూరు పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ సురేంద్రనాయుడు మీడియాతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 16న నగరి నుంచి కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న 375 బస్తాల బియ్యాన్ని పరమేశ్వరమంగళం పట్టుకున్నట్లు చెప్పారు. ఈ కేసులో ప్రధాన నిందితులైన నగరికి చెందిన ఏ.ఎస్.బాలన్ అనియాస్ పాడుగుబాల(48), ఎస్.పొన్నురాజ్ అలియాస్ పొన్నుస్వామి(40), కె.గణేష్(43)ను శుక్రవారం స్థానిక బైపాస్ రోడ్డులోని కాఫీడే షాపు వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

### ఎస్వీయూలో చిరుత సంచారం



చిరుత పాదముద్రల నమూనాలను సేకరిస్తున్న ఫారెస్ట్ సిబ్బంది

**తిరుపతి సిటీ:** ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియం వద్ద చిరుత సంచరిస్తున్నట్లు విద్యార్థులు గమనించారు. బీపీఈడీ విద్యార్థులు శుక్రవారం ఉదయం 5.30 గంటలకు రన్నింగ్ ప్రాక్టీస్‌కు వెళ్తుండగా చిరుత తారస పడింది. వారు వెంటనే వీసీ, రిజిస్ట్రార్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. చిరుత సంచరించిన ప్రాంతానికి రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శివశంకర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, ఫారెస్ట్ రేంజ్ కి చెందిన బయోలజిస్టులు చేరుకున్నారు. చిరుత పులి పాదముద్రలను పరిశీలించారు. చిత్రాలు, నమూనాలను సేకరించి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లకు పంపారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ అధికారులు మాట్లాడుతూ చిరుత పులి సాధారణంగా జింకలు, కుక్కలను వేటాడడానికి వస్తుంటాయని తెలిపారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో కెమెరాలు ఏర్పాటు చేశామని, విజువల్స్ దొరికితే ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం బోన్ ఉంచి చిరుతను బంధిస్తామని తెలిపారు.

**విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి**

విద్యార్థులు సాయంత్రం 6 గంటలు దాటిన తర్వాత బయటకు రాకుండా హాస్టళ్లలోనే ఉండాలని రిజిస్ట్రార్ తెలిపారు. ఆహార వ్యర్థాలను రోడ్లపై పడవేయవద్దన్నారు. వర్సిటీలో కుక్కలు తిరగకుండా చూడాలని ప్రిన్సిపాళ్లు, హాస్టల్ వార్డెన్లు, వర్కర్లు, క్యాంటీన్ యాజమాన్యాలను ఆదేశించారు. అదేవిధంగా వర్సిటీ రోడ్లపై తోపుడు బండ్లు ఉండకుండా చూడాలని, ఐడీ కార్డు లేని బయటి వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు.

### పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

**రామకుప్పం:** స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. మండలంలో శాంతిభద్రతలపై తీసుకోవాల్సిన చర్యలపై పోలీసులకు తగు సూచనలు ఇచ్చారు. అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. పోలీసులకు, ప్రజలకు మధ్య స్నేహపూర్వ వాతావరణం ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కుప్పం డివిజన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### 23న తిరుపతిలో భక్త సమ్మేళన వేడుకలు

**తిరుపతి కల్చరల్ :** రామకృష్ణ-వివేకానంద భావ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో తిరుపతి- తిరుచానూరు రోడ్డులోని శ్రీనివాస కల్యాణ మండపంలో 6వ భక్త సమ్మేళనం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్షుడు స్వామి సుకృతానంద తెలిపారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. వేడుకల్లో దేశంలోని రామకృష్ణ మఠాలు, మిషన్లకు చెందిన 12 మంది ప్రముఖ స్వామీజీలు, మాతాజీలు పాల్గొని ఆధ్యాత్మిక సందేశాలు ఇస్తారని తెలిపారు. ఈ సందర్భంగా భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 22న ఇస్కాన్ రోడ్డులోని రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో దివ్యజనని శారదామాత 172వ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో పరిషత్ ప్రతినిధులు వి.సుధాకర్ రెడ్డి, వి.శివరామరెడ్డి పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న డీవైఈఓ ప్రభాకర్‌రాజు

**పుత్తూరు:** స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గురువారం అండర్-19 రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలను డీవైఈఓ ప్రభాకర్‌రాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలు మూడు రోజుల పాటు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీల్లో 13 జిల్లాలకు చెందిన అండర్-19 బాల బాలికల జట్లు పాటీపడతాయని తెలిపారు. పోటీల అనంతరం రాష్ట్ర బాల బాలికల జట్ల ఎంపిక జరుగుతుందని వెల్లడించారు. ఎంపికైన రాష్ట్ర జట్లు ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాయని వివరించారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో ఆడి రాష్ట్ర జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఏకాంబరాచ్చారి, బాలికల కళాశాల ప్రిన్సిపల్ రఘుపతి, రాష్ట్ర ఖోఖో అబ్జర్వర్ ఈశ్వర్‌నాయక్, ఎస్జీఎస్ సెక్రటరీ జయరామయ్య, ఇతర క్రీడా సంఘాల నాయకులు బాబు, శరత్, బాలాజీ, సుబ్రమణ్యంరెడ్డి, పీడీలు పాల్గొన్నారు.

## 351 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

**బంగారుపాళెం:** మండలంలోని కేజీ సత్రం వద్ద శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఆర్ఐ మధుసూదన్ తెలిపారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, సీఐ శ్రీనివాసులుకు పక్కా సమాచారం అందడంతో కేజీ సత్రం వద్ద జాయింట్ ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. చిత్తూరు నుంచి పలమనేరు వెళుతున్న లారీని ఆపి తనిఖీ చేయగా అందులో 351 బస్తాలు(14,430 కేజీలు) రేషన్ బియ్యం గుర్తించారు. అయితే లారీ డ్రైవర్ పరారైనట్లు చెప్పారు. లారీతో సహా బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్ఓలు హేమచంద్ర, సుబ్బయ్య, మోహనశివ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు న్యాయమూర్తులకు వర్క్‌షాప్

**తిరుపతి లీగల్:** ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న న్యాయమూర్తులకు శనివారం చిత్తూరులో క్రిమినల్ చట్టాలపై వర్క్ షాప్ నిర్వహించనున్నట్టు జిల్లా కోర్టు నుంచి వివిధ ప్రాంతాలకు ఉత్తర్వులు అందాయి. రాష్ట్ర హైకోర్టు, రాష్ట్ర న్యాయ సేవ సంస్థ ఆదేశాల మేరకు చిత్తూరు కోర్ట్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్లో న్యాయమూర్తులకు క్రిమినల్ చట్టాలు, ప్రాక్టీసు, ప్రొసీజర్ అనే అంశంపై అవగాహన కల్పించనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్జి భీమారావు ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం అత్యవసర కేసులను ఆయా ప్రాంతాల్లోని తహసీల్దార్లు విచారించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## సెలెస్ట్రా-25 పోస్టర్ ఆవిష్కరణ

**తిరుపతి సిటీ:** పద్మావతి మహిళా వర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో వచ్చేనెల 28వ తేదీ నుంచి రెండు రోజుల పాటు జరగనున్న సెలెస్ట్రా-25 ఈవెంట్‌కు సంబంధించిన పోస్టర్లను వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజిని విడుదల చేశారు. వర్సిటీలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ యువ ఆవిష్కర్తలు తమ సరికొత్త ఆలోచనలను పదర్శించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు పీ.మల్లికార్జున, వీ.సరిత, డాక్టర్ ఎన్.సాయిలోహిత, బీ.లక్ష్మీదేవి పాల్గొన్నారు.




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు